

# గూడు విడిచిన గుండె

డా. కె. వివేకానందమూర్తి

**ఇది కథో, వ్యథో కచ్చితంగా చెప్ప లేను. లండన్ హీత్రో ఎయిర్‌పోర్ట్ ఎప్పటిలాగే ఎంతో బిజీగా వుంది. పెద్దపెద్ద అద్దాలకు అవతల రన్‌వేమీద అనుక్షణం యెగిరి, వాలే విమానా లతో, గుంపులు గుంపులుగా సేద దీర్చుకుంటున్న జంబో జెట్లతో జటా యువుల సంతలా వుంది.**

**మా ఆవిడా, పిల్లలూ ఇండియా వెళ్లే ఫ్లైట్ ఎక్కారు. వాళ్లకి కనిపించదని తెలిసినా చెయ్యూపి నేను వొంటరిగా యింటికి కదిలాను.**

**కదిలే కార్లోంచి ఆకాశం కేసి చూశాను. సాయంత్రపు సూరీడు చల్లగా ఫేడవుతు న్నాడు. వినీలాకాశం విస్కీ రంగులోకి మారుతోంది.**

**ఇందాక చూసిన పెద్ద విమా నాలు పైకెగిరి పోతూ పిచ్చుకల్లా అనిపిస్తున్నాయి. ఇంకోదేశంలో వాలేదాకా వాటికి ఆకాశమంత స్వేచ్ఛ. నాకు చిన్నప్పట్నించీ యెగిరే పక్షుల్ని చూడ్డం యెంతో యిష్టం. అందుకే యెగిరే విమా నాలు కూడా యిష్టం. అవి స్వేచ్ఛకు ప్రతీకల్లా కనిపిస్తాయి.**

ఇంటికొచ్చాక మా ఆవిడ చెప్పిన పనులు గుర్తు చేసుకున్నాను. తను తిరిగి వచ్చేలోగా యింటికి హీటింగ్ సిస్టమ్ మార్పించమని చెప్పింది. ఈ చలిదేశంలో తిండిలేక పోయినా బ్రతకవచ్చు గానీ, వెచ్చదనం లేకుండా బ్రత కలేం.

మర్నాడే ఇంజనీర్‌తో మాట్లాడి వారం లోపునే హీటింగ్ సిస్టమ్ మార్పించాను. ఇప్పుడు యిల్లు వెచ్చగా అమ్మ వొడి అంత బాగుంది.

హీటింగ్ బోయిలర్ మార్చినప్పుడు యింటి ముందు భాగంలో చూరు కింద వున్న స్టీమ్ గొట్టాన్ని తొలగించారు. అలా చెయ్యడం వల్ల చూరుకింద గోడలో ఒక నాలుగంగుళాల కన్నం పడింది. ఆ కన్నం పూడ్చకుండా అలాగే వదిలేశారు. ఇక్కడంతా ఎవరికి వారు వారి పని మాత్రమే చేస్తారు. గుండె డాక్టరు చెయ్యి ముట్టుకోడు. చెయ్యి డాక్టరు గుండె ఆగిపోయినా పట్టించుకోడు. శవం చేతికి కట్టు కట్టేసి తన పని తను చేసుకుపోతాడు.

సరే, చూరుకింద వున్న కన్నం చిన్నదేకదా, నేనే కాస్త సిమెంట్‌తో కప్పేసి కవర్ చేసేద్దామనుకు న్నాను. సరిగ్గా ఆ చూరుకిందే నా కారు గ్యారాజ్ ముందు పార్కింగ్ ఏరియా వుంది. నేను రోజూ నా కారు పార్కింగ్ ఏరియాలోనే వదిలేస్తాను.

ఒకరోజు కారు పార్క్‌చేసి పైకి చూశాను. ఎక్క డినుంచో ఒక మైనా పిట్ట ఎగురుతూ వచ్చి, చూరు కింద కన్నం వున్న గోడ వెలితిలోకి దూరింది. తర్వాత రెండు మూడుసార్లు మైనా రాకపోకలు చూశాను. తను అక్కడ తనకో చిన్నగూడు కట్టుకుం దని అర్థమైంది. మా యింటి ఫ్రంట్‌గోడలో కన్నం ఆ మైనా కొత్త ఇంటికి యిప్పుడు సింహద్వారం. హాయిగా తన కొత్త యింటికి మైనా వస్తూ పోతూ వుంటే యిప్పుడు ఆ వెలితిని నేనెలా పూడ్చగలను.

రోజులు గడుస్తున్నాయి. ఒకరోజు యింటి ముందు లాన్‌లో కూర్చుని పేపరు చదువు కుంటూ పైకి చూశాను. మైనా యిప్పుడు చిన్నచిన్న ఆహారం ముక్కుకి కరుచుకుని తీసుకొచ్చి యింకా యెగరడం రాని తన పిల్లమైనాలు మూడింటికీ తిని పిస్తోంది. ఆవి తలలు సాగదీసుకుని అడపాదడపా చిన్నచిన్న శబ్దాలు చేస్తూ బైటికి తొంగి చూస్తు న్నాయి.

నా మనసు కుదురుగా లేదు. ఆ కన్నం పూడ్చి మైనా కొత్తగూటిని సమాధి చెయ్యాలా వద్దా అనే సందిగ్ధం మొదలైంది నాలో. నా స్నేహితుడు శివరావుని అడిగాను. 'శివ! శివ!' అన్నాడు. 'అడిగింది నీ పేరు కాదు, ఏం చేస్తే బాగుంటుందో చెప్పు' అనడిగాను. తను చెప్పాడు. 'ఈ దేశంలో పక్షిగూడు పెట్టుకున్నాక ఆ గూడు పీకి పక్షిని తరిమేయడం చట్టరీత్యా నేరం. పక్షి పరిరక్షక సంఘం వారు నిన్ను చికెన్‌లా ఫ్రై చేసుకుని తినేస్తారు' అని వార్నింగిచ్చాడు.

'అయితే మరి వాళ్లే క్రిస్మస్‌కి టర్కీ కోడిని చంపి యెందుకు తింటారు?' అని అడిగాను.


'చంపకుండా తినడం కుదరదు గనుక' అన్నాడు.

'అది కాదు నా వుద్దేశం. చంపి తినడం యింకా పెద్ద హింసకదా?' అనడిగాను.

'క్రిస్మస్‌కి టర్కీ తినడం చట్టవిరుద్ధం కాదు. అంచేతవాళ్లనే అడుగు – నిజంగా అడిగావు గనుక – నిన్ను కూడా టర్కీలా తినేస్తారు' అని మళ్లీ వార్నింగిచ్చాడు. తెల్లవాడి మనసు అర్థం గాక నేను తెల్లబోయాను.

ఏమైతేనేం, శివరావు చెప్పిన సలహా మేరకు, మా యింటిగోడ కన్నం పూడ్చే ప్రయత్నం ప్రస్తుతానికి విరమించుకున్నాను. నాకసలే పక్షులంటే యిష్టం, ప్రేమ. మైనా గూడు కూల్చేసి, గోడ కప్పేసి, మైనాని, ముద్దొచ్చే మైనా పిల్లల్ని బైటికి విసిరేసి నేను బావుకునేదేవిటీ – క్రూరత్వం అనిపించింది.

ఆ తర్వాత నుంచీ మైనా కనిపించినప్పుడల్లా 'హాయ్' అని పలకరించడం



మొదలెట్టాను. మైనా నన్నేం పట్టించుకునేది కాదు. తన గూడు, తన పిల్లలు తన బిజీ తనది. అయినా నేను 'హాయ్' అనడం మానలేదు.

ఇలావుండగా నేను పాత కారు ట్రబులిస్తుంటే మార్చి కొత్తకారు తీసుకున్నాను. కొత్తకారు ధగధగ మెరిసిపోతూ వుంది. ఒక రోజు కారెక్కబోతూ చూశాను. మైనా గారు గూడు కింద పార్కింగ్ ఏరియాలో పార్క్‌చేసిన కారు మీద రెట్టలు విసర్జించి కొత్త కారుని చెత్తకారులా తయారు చేశారు. నాకు చాలా కోపం వచ్చింది.

మైనాపిల్లలు పెరిగి ఎగురనేర్చారు. క్రమంగా రోజూకారు మీద మైనా రెట్టలు కడుక్కోవడం ఒక రొటీన్‌లా తయారయి విసిగిపోయాను. ఇక లాభం లేదనుకున్నాను. ఏమైనా, మైనా గూడు పెట్టుకున్న గోడ కన్నం పూడ్చెయ్యాలనుకున్నాను.

కావల్సిన సామాన్లు రెడీ చేసుకుని ఒకరోజు పనికి సెలవు పెట్టాను. అవాళ మైనా, పిల్లలు గూట్లోంచి బైటికి వెళ్లగానే కన్నం సిమ్మెంట్‌తో కప్పేద్దామనుకున్నాను. కానీ మనసులో ఒక పక్క బాధగా అనిపిస్తూనే వుంది. లాన్‌లో సామాన్లు పెట్టుకుని, ఈజీచైర్లో అనీజీగా కూర్చుని కాపు వేశాను. పేపరు చదువుకుంటూ మధ్యమధ్యలో గూడు వున్న గోడ కన్నం వేపు చూస్తున్నాను. ప్రతి రోజూ ఉదయమే గూడు విడిచే పిట్టలు యివాళ యింకా తెమల్లేదేవిటా అనుకుంటున్నాను.

చివరికి లంచ్‌టైమ్ దాటుతుంటే మైనా, మైనా వెనుక మైనా పిల్లలు కేరింతలతో గూడు విడిచి బైటికి ఎగిరాయి. అలా యెగురుతూ యెగురుతూ ఆకాశంలో కనిపించనంత దూరంలో కలిసిపోయాయి. అలాగే అవి ఎగిరిన ఆకాశ మార్గం వేపు తదేకంగా చూస్తు వుండిపోయాను. నాకు తెలుసు. ఇప్పుడులేచి, నేననుకున్న కార్యక్రమం పూర్తి చెయ్యాలి. మైనా యిల్లు పీకి నా స్వార్థానికి నేను పందిరివేసుకోవాలి. కానీ మనస్సు వెనక్కి లాగుతోంది. ఎందుకో గూడుకప్పి మైనా కుటుంబాన్ని నిర్వాసుల్ని చెయ్యకూడదన్న ఆలోచన నాలో నెమ్మదిగా గూడు కట్టుకుంటోంది. కాసేపు గోడలో గూటివేపు, కాసేపు ఆకాశం వేపు శూన్యంగా చూడసాగాను. అప్పుడే నా మైనాను నేను మిస్సయి పోతున్నట్టుగా వుంది. గోడకున్న కన్నం పూడ్చటం నా తరం కాలేదు. నా మనస్సు రాజీ పడటం లేదు. ఇక లాభం లేదని కన్నం కప్పేసా కసాయి పనికి స్వస్తి చెప్పాను.

ఒక్కటే అనుకున్నాను. మైనా, పిల్లలు తిరిగివచ్చి ఎప్పటిలాగే కేరింతలు కొడుతూ, కూస్తూ మా యింటిగోడ గూట్లో కలకాలం హాయిగా కాపురం వుండాలని.

మైనా, పిల్లలు మళ్లీ తిరిగి రాలేదు. చాలా రోజులు, రోజూ ఫ్రంట్ గార్డెన్‌లో కూర్చుని యెదురు చూశాను.

మైనా యెంతకీ తిరిగి రాలేదు. నా మనో భావాలు తనకి తెలిసినట్టుగా, తెలియక నన్ను యిబ్బంది పెట్టినందుకు బాధ పడినట్టుగా – యెందుకో మరి! తిరిగి రాలేదు.

అవాళ గార్డెన్లో కూర్చున్న నేను మైనా కోసం బాగా బెంగెట్టేసుకున్నాను. కాసేపట్లో పెద్ద వర్షం వచ్చింది – నాతో పాటు అవునంటూ ప్రకృతి యేడుస్తున్నట్టు.

మైనా, పిల్లలు మరి తిరిగిరాలేదు. ఆ రోజు అలా యెగురుతూ వెళ్లిపోవడమే, వెళ్లిపోవడం.

నా మనసులో వెలితిలా మా యింటిగోడలో వెలితి అలాగే వుండిపోయింది.

తర్వాత యెప్పుడో నా స్నేహితుడు శివరావు మా యింటికొచ్చినప్పుడు గోడ వేపు చూసి, 'అయితే కన్నం ఖాళీగానే వదిలేసావన్న మాట' అన్నాడు.

రేపు మా ఆవిడ, పిల్లలు ఇండియా నుంచి తిరిగి వస్తారు.

నాకేం తేడాగా అనిపించడం లేదు.

★

డాక్టర్ కె.వివేకానందమూర్తి
07900218522